RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 293 | అక్టోబర్ 28, 2025 | వెల : రూ.3-00



**పారిశుధ్య నిర్వహణ 'గుండు' సున్నా!**

3లో..



- వీధి కుక్కల కేసులో సుప్రీంకోర్టు ఆగ్రహం
- ఆదేశాలు పాటించని రాష్ట్రాలు, యూటీలపై ఫైర్
- ఆగస్టు 22న ఉత్తర్వులిస్తే.. కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్న
- వచ్చే నెల 3న ఆయా స్టేట్స్, యూటీల సీఎస్‌లు ధర్మాసనం ఎదుట హాజరుకావాలని ఆదేశం

# చలనం లేదా..!?



**వేద న్యూస్, డెస్క్:**

వీధి శునకాల కేసులో తమ ఆదేశాలు పాటించని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆగస్టు 22న ఉత్తర్వులిస్తే, ఇప్పటివరకు కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించింది. వీధి కుక్కల బెడద కేసులో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, బెంగాల్, తెలంగాణ మాత్రమే కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేశాయని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా,జస్టిస్ ఎన్ వీ అంజరియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ సందర్భంగా పేర్కొంది.

**– సీఎస్‌లు అటెండ్ కాకపోతే చర్యలు: సీజేఐ ధర్మాసనం**

ఆదేశాలు పాటించని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు నవంబర్ 3న తమ ఎదుట హాజరుకావాలని ధర్మాసనం ఆదేశించింది. వీధికుక్కల దాడులపై రోజూ మీడియాలో వార్తలు వస్తున్నా, చలనం లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇన్ని రోజులు కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదో వివరణ ఇవ్వాలని ఈ సందర్భంగా పేర్కొంది. సీఎస్‌లు హాజరుకాకపోతే తదుపరి చర్యలకు ఆదేశిస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్ అన్నారు. వివరణ సంతృప్తికరంగా లేకున్నా, జరిమానాతో పాటు చర్యలకు ఆదేశిస్తామని పేర్కొన్నారు. ఢిల్లీ -ఎన్ సీఆర్ రీజీయన్‌లో వీధి కుక్కలకు సంబంధించిన అంశాన్ని కొన్ని నెలల కింద సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుంది. విచారణ సందర్భంగా దేశవ్యాప్తంగా ఈ సమస్య ఎలా ఉందనే అంశాన్ని తెలపాలని రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆదేశాలు పాటించని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

వీధి కుక్కల దాడుల వల్ల ఢిల్లీ , ఎన్సీఆర్ పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వార్తలు వచ్చాయి. దీనిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం కోర్టు, ఢిల్లీ , ఎన్‌సీఆర్ పరిధిలోని నగరాలు, పట్టణాల్లో వీధి కుక్కల కోసం 5వేలు చొప్పున శాశ్వత షెల్టర్లను ఏర్పాటు చేయాలని పేర్కొంది. 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కులను షెల్టర్లకు

మిగతా 4వ పేజీలో..



## కట్టింగ్ మాస్టర్‌గా మారిన సీఎం..!?

- మోదీ చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే.. రేవంత్ త్వరగా అమలు చేస్తడు
- కేటీఆర్ సంచలన ఆరోపణలు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణలో నడుస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, కాంగ్రెస్–బీజేపీ కలిసి నడిపిస్తున్న ప్రభుత్వమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కేంద్రంలోని మోదీ సర్కారు తెచ్చిన చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే కూడా తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి త్వరగా అమలు చేస్తారని ఆయన విమర్శించారు. శంషాబాద్‌లో బీఆర్ఎస్ మైనార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి 'బడే భాయ్' (మోదీ) కోసం పనిచేస్తున్నారని, అందుకే ఇక్కడ నడుస్తున్నది కాంగ్రెస్–బీజేపీ కలిసి నడిపిస్తున్న ప్రభుత్వమని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలే కాకుండా వంద గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, తులం బంగారం ఇస్తాం, యువతులకు రూ.2500 ఇస్తాం, వృద్ధులకు రూ.4 వేలు పెన్షన్ ఇస్తామని అరచేతిలో స్వర్గం చూపించారని ఎద్దేవా చేశారు. "అదేదో సినిమాలో కోడిని వేలాడదీసి దాన్నే చికెన్ అనుకోమన్నట్లు.. ఇక్కడ కూడా అన్నీ చెప్పి, ఒక్కటి కూడా అమలు చేయట్లేరు" అని కేటీఆర్ విమర్శించారు. మైనార్టీ విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని, కేసీఆర్ హయాంలో ఇచ్చిన పథకాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని మండిపడ్డారు.

## రైతు కష్టం వృథా కాదు



**వేద న్యూస్, భువనగిరి :**

యాదాద్రి భువనగిరి జిల్లా రైతుల సంక్షేమంపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోమవారం ప్రత్యేక దృష్టి సారించారు. భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఆయన జిల్లాలోని ఉన్నతాధికారులతో వరిధాన్యం సేకరణ, పత్తి కొనుగోలు మరియు ఇతర రైతుల సమస్యల పరిష్కారంపై విస్తృత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్, సివిల్ సప్లైస్, సహకార, రెవెన్యూ శాఖల అధికారులతో క్షుణ్ణంగా చర్చించారు. ధాన్యం సేకరణ కేంద్రాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా, వేగంగా సాగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం రైతు కష్టం వృథా కాకుండా చూస్తుందని, ప్రతి గింజను సకాలంలో కొనుగోలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## దక్కన్ వ్యవహారంపై సీబీఐ విచారణకు సిద్ధమా?

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాబినెట్ 'దండుపాళ్యం ముఠా' లాంటిదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాను ఒక్కసారి కాదు, పదిసార్లు ఇదే మాట అంటానని ఆయన స్పష్టం చేశారు. ఉన్న విషయం మాట్లాడితే కొందరు మంత్రులకు ఉలుకు ఎందుకని ఆయన ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ముధోల్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేత సిందే దీక్షిత్‌తో పాటు ఆయన అనుచరులను బీఆర్ఎస్ పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానించిన అనంతరం ఆయన మాట్లాడారు. మంత్రుల పంచాయతీల పరిష్కారం కోసమే ముఖ్యమంత్రి క్యాబినెట్ సమావేశాలు పెట్టుకుంటున్నారని హరీశ్ రావు విమర్శించారు. ఈ సందర్భంగా దక్కన్ యాజమాన్యాన్ని తుపాకీతో బెదిరించిన వ్యవహారాన్ని ప్రస్తావించారు. ఈ కేసులో నిగ్గు తేల్చేందుకు సీబీఐ విచారణకు సిద్ధమా? అంటూ ఆయన సీఎం రేవంత్ రెడ్డికి నేరుగా సవాల్ విసిరారు. దమ్ముంటే ఈ అంశంపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని



ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క భవనం కూడా కట్టలేదని, కానీ 'కటింగ్ మాస్టర్‌గా' మారారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రారంభించిన సంక్షేమ పథకాలకు కోత (కటింగ్) పెట్టడం, కేసీఆర్ కట్టిన భవనాలకు రిబ్బన్ కట్ చేయడం రేవంత్ రెడ్డి పని అంటూ ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ ప్రభుత్వ హయాంలో ఆదిలాబాద్ జిల్లాలో పెండిరగ్ ప్రాజెక్టుల విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ప్రజల సమస్యలపై దృష్టి సారించి, అభివృద్ధి పనులను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఉప ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం



**– డా. కె. లక్ష్మణ్**

**వేద న్యూస్, హైదరాబాద్ :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ రాజ్యసభ సభ్యులు, జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు డా. కె. లక్ష్మణ్ చురుకుగా పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్ రెడ్డితో కలిసి ఆయన శ్రీనగర్ కాలనీ డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్ర ఎర్రారెడ్డి గూడ హనుమాన్ దేవాలయం నుంచి ప్రారంభమైంది. ఎర్రారెడ్డి గూడ, ఆర్‌బీఐ క్వార్టర్స్ మరియు ఇంజనీర్స్ కాలనీ ప్రాంతాల మీదుగా సాగింది. స్థానిక నివాసితుల నుంచి ఈ పాదయాత్రకు అనూహ్యమైన ఉత్సాహం, మద్దతు లభించినట్లు డా. కె. లక్ష్మణ్ తెలిపారు. లంకాల దీపక్ రెడ్డి గెలుపు కోసం ప్రజలు ఉత్సాహంగా మద్దతు ఇవ్వడం పట్ల డా. లక్ష్మణ్ ధన్యవాదాలు తెలిపారు. ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు..!

**– కబ్జాదారులపై హైడ్రా కమిషనర్ దృష్టి**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

నగర శివారు ప్రాంతాల్లో జరుగుతున్న ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలు, రోడ్ల కబ్జాలపై హైదరాబాద్ అభివృద్ధి సంస్థ (హైడ్రా) ప్రజావాణి వేదికగా పౌరులు తమ గళం వినిపిస్తున్నారు. ఎక్కడ అక్రమం జరిగినా చూస్తూ ఊరుకోకుండా, ఫొటోలు, వీడియోలతో సహా సాక్ష్యాలను చూపిస్తూ నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ ప్రజావాణి ద్వారా తమ దశాబ్దాల సమస్యలకు సైతం త్వరగా పరిష్కారం దొరుకుతుందనే నమ్మకంతో సోమవారం ఒక్కరోజే 52 ఫిర్యాదులు అందాయి. కొందరు బాహాటంగా ఫిర్యాదులు చేస్తుండగా, మరికొందరు తమ వివరాలు బయటపెట్టవద్దని అధికారులను కోరారు. అందిన ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేకంగా పరిశీలించారు. అత్యధికంగా ఫిర్యాదులు కబ్జాల మీదనే ఉండటం గమనార్హం. బాలానగర్ మండలం, కూకట్‌పల్లిలోని హస్మత్‌పేటలో ప్రభుత్వానికి చెందిన 10 ఎకరాల భూమిని ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు వచ్చింది. అదే ప్రాంతంలో, నిజాం కాలం నాటి చారిత్రక విలువ కలిగిన 28.28 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక రాజకీయ నాయకులు రియల్ ఎస్టేట్ వెంచర్‌గా మార్చి విక్రయిస్తున్నారని ఓల్డ్ బోయిన్‌పల్లి నివాసులు సాక్ష్యాలతో సహా ఫిర్యాదు చేశారు.




**మరో ప్రధాన సమస్య చెరువుల అన్యాక్రాంతం**

3లో..

**CHANGE OF NAME**

I,PAKA CHARRY (Old Name) Residing at 4-76/2, Marripalligudem, Mandal Kamalapur, District Hanamkonda, Telangana- 505102. here by declare that I have changed my name as PAKA ARJUN (New Name) (Aadhar Card) S/o. PAKA RAMESH.

వేద న్యూస్

మంగళవారం అక్టోబర్ 28, 2025

# ప్రభుత్వ విధానాలు, పరిపాలన 'నాణేనికి రెండు ముఖాలు'

**వేద న్యూస్, హైదరాబాద్:**

ప్రభుత్వ విధానాలు, పరిపాలన 'నాణేనికి రెండు ముఖాలు'గా అభివర్ణించారు ప్రభుత్వ పరిపాలనాశాస్త్ర ఆచార్యులు, బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పూర్వ అధ్యక్షులు కె. సీతారామారావు. భారతీయ ప్రభుత్వ పరిపాలనా సంస్థ, సిటీ కాలేజీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం సంయుక్తంగా "ప్రభుత్వ విధానాలు, ప్రభుత్వ పాలన-నూతన ధోరణలు" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెలువరించిన ఆలోచనాత్మక ప్రసంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాపంచిక సందర్భంలో విధాన రూపకల్పన, సమీక్ష, అమలులోని సవాళ్లు, అవకాశాలను గురించి మాట్లాడారు. విధాన రూపకల్పన సరళంగా అనిపించినప్పటికీ, పరిపాలన, సామాజిక గతిశీలత సంక్లిష్టతల కారణంగా దాని అమలు గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటుందని ప్రొఫెసర్ రావు అన్నారు. ప్రపంచ దేశాలన్నీ ఇవ్వాళ పరస్పరాధారితంగా ఉన్నాయని, ఈ స్థితి అనివార్యమని అన్నారు. సాంకేతికత, శ్రమ, మూలధనం, సేవల సమ్మేళనమే నూతన ధోరణి అని, దాని నేపథ్యంలోనే విధాన నిర్ణయాలు జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. పౌరులు పరిపాలనలో పారదర్శకతను కోరుకుంటున్నారని, ఈ అంచనాలు నెరవేరకపోతే పౌర సమాజం అధికారులను బాధ్యతాయుతంగా ఉంచుతుందని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యంపై నియంత్రణ నూతన ధోరణిగా కనబడుతున్నదని అన్నారు. ప్రభుత్వ పరిపాలన సందర్భానుగుణంగా ఇతర సామాజిక శాస్త్రాలలో అభివృద్ధి చెందుతున్న ధోరణులతో అనుసంధానం కావాలని ప్రొఫెసర్ రావు సూచించారు. మరో ముఖ్య వక్త, పూర్వ కాకతీయ విశ్వవిద్యాలయ పరిపాలనా విభాగ అధ్యక్షులు ఆచార్య కె.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రపంచీకరణ ప్రభావం, నూతన-వలసవాద ఆర్థిక సిద్ధాంతాలు, పాలనా ప్రక్రియల్లో వచ్చిన మార్పుల లాంటివన్నీ ఇవ్వాళ పరిపాలనను ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. నూతన రైట్ వింగ్ భావజాలం పెరగటం, జాతి, మత ధ్రువీకరణలు సవాళ్లుగా ఎదురవుతున్నాయని అన్నారు. న్యాయవ్యవస్థ బలహీనపడితే, కార్యనిర్వాహక అధికారం కేంద్రీకృతమైతే, ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు. మార్పు ప్రకృతి ధర్మమని, అందుకే సిద్ధాంతం ఆచరణకు పునాది కావాలి, విమర్శ ప్రగతికి మూలం కావాలని అభిలషించారు. ప్రభుత్వ విధాన రంగంలో వచ్చిన ప్రతి మార్పు ప్రజల సంక్షేమానికి దోహదపడేలా ఉండాలి. ఇదే నూతన ప్రభుత్వ పాలన సిద్ధాంతం సూచించే ప్రధాన దిశ అని అభిప్రాయపడ్డారు.

సదస్సుకు అధ్యక్షత వహించిన ఐఐపిఏ చైర్మన్ ప్రొఫెసర్ గోపాల్ రెడ్డి సంస్థ ఉద్దేశాలు, సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, విద్యార్థులకు, పరిశోధకులకు సంస్థ అందిస్తున్న సహకారం గురించి తెలియజేశారు. గౌరవ అతిథిగా పాల్గొన్న సిటీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మావతి మాట్లాడుతూ సిటీ కాలేజీలో అప్రెంటిస్ షిప్ తో కూడిన డిగ్రీ కోర్సులను అందిస్తున్నామని, అలాగే భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్ లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థుల కోసం పబ్లిక్ పాలసీ-గవర్నెన్స్ వంటి అత్యాధునిక డిగ్రీ కోర్సును అందిస్తున్నామని అన్నారు. పరిపాలన శాస్త్ర విభాగ అధ్యక్షులు డా.శంకర్ కుమార్ సమన్వయం చేసిన కార్యక్రమంలో ప్రొఫెసర్ ఏవిఎన్ రెడ్డి, ట్రెజరర్ డా.సురేందర్, వైస్ ప్రిన్సిపాల్ డా.శాంతి, డా.నీరజ, డా.భాస్కర్, డా.మల్లిక, డా.తిరుపతి, డా.రవికుమార్, డా.కృష్ణవేణి, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్ గౌడ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



– ఆచార్య కె. సీతారామారావు

# సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

దేశంలో పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాస్వామిక ఉద్యమాలను తీవ్రతరం చేస్తూ సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని, బీసీ రిజర్వేషన్లకు బిజెపి పార్టీనే ప్రధాన అడ్డంకని, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్ అన్నారు. సోమవారం రామారంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వేసుకున్న గుడిసెల కేంద్రం వద్ద సిపిఐ శాఖ సమితి సమావేశం సిపిఐ శాఖ సహాయ కార్యదర్శి పొక్కుల సదానందం అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్ హాజరై మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం విభజన రాజకీయాలు చేస్తూ దేశాన్ని విడగొట్టే ప్రయత్నం చేస్తున్నదని, ప్రజా వ్యతిరేక చట్టాలు, కార్మిక వ్యతిరేక చట్టాలు, ముస్లిం మైనార్టీ వ్యతిరేక చట్టాలను తీసుకొస్తూ మత విద్వేషాలను సృష్టిస్తున్నదని అన్నారు. అదేవిధంగా బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నదన్నదని దుయ్యబట్టారు. రాష్ట్ర శాసనసభలో ఏకగ్రీవంగా 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు కల్పించాలని తీర్మానించి జీవో తీసి బిల్లు ఆమోదించి రాష్ట్ర గవర్నర్ కు పంపిస్తే గవర్నర్ బిల్లు పెండింగ్ లో పెట్టడం వెనుక బీజేపీ కుట్ర దాగివుందని ఆరోపించారు. ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో 9వ షెడ్యూల్లో పెట్టి రాజ్యాంగ సవరణ చేసి మెజార్టీ సమాజమైన బీసీలు ప్రయోజనం పొందేటట్లు చట్ట సవరణ చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బీసీల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్న బీజేపీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు గుణపాఠం చెప్పాలన్నారు. బీసీ రిజర్వేషన్లకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బీజేపీని నిలువరించే వామపక్షాలను బలోపేతం చేయాలని కోరారు. ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏండ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక, దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. పేదల కోసం పోరాటం చేసేది ఒక కమ్యూనిస్టులు మాత్రమేనని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇండ్ల స్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, కానీ ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. పేదలకు, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకోని నివసిస్తున్న వారికి ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ హనుమకొండ మండల సహాయ కార్యదర్శి దామెర సుదర్శన్, గ్రామ శాఖ కార్యదర్శి మోతె రమేష్, శాఖ సహాయ కార్యదర్శి పొక్కుల సదానందం, నాయకులు రాగల ప్రభాకర్, గోల్కొండ సారయ్య, వంకుడోతు రాజుకుమార్, సింగారపు ప్రేమ్ కుమార్, భోగం అనురాధ, పి. భాగ్య, పందిళ్ళ నరేష్, గజ్జెల మొగిలి, మేకల ఎల్లయ్య, మల్లికార్జున్, పి. రాజయ్య, తూర్పాటి అంజి, ప్రమోద్ పాల్, కె. శారద, పర్వతం భాగ్యమ్మ, అందే పద్మ, యాకమ్మ, ఎస్కే సమీరా, ఎండీ యాకుంబి తదితరులు పాల్గొన్నారు.



# బ్రిడ్జి నిర్మాణంలో విఫలమైన అధికార పార్టీ పాలకవర్గం..!?

**వేద న్యూస్,బోయినిపల్లి:**


రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్తంభంపల్లి బ్రిడ్జి నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ గత రెండు సంవత్సరాల నుంచి కాలయాపన చేస్తూ ఈ ప్రాంత ప్రజానికాన్ని, ప్రయాణికుల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని మండల సిపిఎం పార్టీ పక్షాన గురిజాల శ్రీధర్ ఆరోపించారు. ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారి పార్టీ ఎమ్మెల్యేలు ఇద్దరు ఉన్నప్పటికీ ఇప్పటివరకు కూడా బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం మేలుకొని బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురిజాల శ్రీధర్, పార్టీ నాయకులు రామంచా అశోక్, పులి బాబాయ్,తదితరులు పాల్గొన్నారు.



# సహకార సంఘ అక్రమాలపై అధికారికి ఫిర్యాదు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట సహకార సంఘం లో జరిగిన అక్రమాలు ఖరీఫ్ 2021 సీజన్ నుండి ఖరీఫ్ 2024 వరకు సీజన్లలో సహకారసంఘం లో దాదాపు 95 లక్షల అక్రమాలు జరిగాయని సెంటర్ల నిర్వహణలో అవకతవకల్లో సంఘం సుమారు 95 లక్షల రూపాయల పైగా నష్టపోయిందని జిల్లా సహకార అధికారికి సంఘ సభ్యులు ఫిర్యాదు చేయడం జరిగిందని సంఘ సభ్యులు తెలిపారు.. దీనిపై సత్వరమే విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదు అందించారు. దీనికి స్పందించిన జిల్లా సహకార అధికారి పూర్తిస్థాయిలో విచారణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పాలకవర్గ సభ్యులు చల్ల నవీన్ రెడ్డి గన్నెరం వసంత నర్సయ్య , మాజీ పాలకవర్గ సభ్యులు నాయని నవీన్ కుమార్ పాల్గొన్నారు.



# నేడు కేయూ ఆంగ్ల విభాగం కాన్ఫరెన్స్

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కేయూ ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో నేడు అక్టోబర్ 28న మంగళవారం ఉదయం 11.30 గంటలకు విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగ సెమినార్ హాల్లో ఒక రోజు డిపార్టుమెంటెల్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తునట్టు, విభాగాధిపతి, డిపార్టుమెంటెల్ కాన్ఫరెన్స్ అధ్యక్షురాలు డాక్టర్ ఆర్. మేఘనా రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేయూ విసి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, వర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, ఆర్ట్స్ విభాగాల డీన్ ఆచార్య బి. సురేష్ లాల్, కేయూ పాలక మండలి సభ్యులు ఆచార్య ఎం.నవీన్, డాక్టర్ బి. సుకుమారి, ఇంగ్లీష్ విభాగ సహా ఆచార్యులు డాక్టర్ బి. దీపా జ్యోతి హాజరవుతారని ఈకార్యక్రమానికి కన్వీనర్ గా పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు పి. నిర్మలతో పాటు కేయూ పరిధిలోని కళాశాలల్లోని ఆంగ్ల విభాగ ఇంచార్జ్ అధ్యాపకులు పాల్గొంటారని డాక్టర్ ఆర్. మేఘనా రావు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎన్ఎస్ఎస్ ప్రీ ఆర్డీ క్యాంప్ కు కేయూ విద్యార్థులు

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**




అక్టోబర్ 31 నుంచి నవంబర్ 9 వరకు గుజరాత్ పఠాన్ లోని, నార్త్ గుజరాత్ యూనివర్సిటీలో జరిగే ప్రీ రిపబ్లిక్ డే క్యాంపుకు కాకతీయ విశ్వవిద్యాలయం ఎంపికైనట్లు కేయూ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ నుండి సిహెచ్.అక్షయ శ్రీ, హనంకొండ వాగ్దేవి డిగ్రీ అండ్ పి.జి.కాలేజీ నుండి సిహెచ్. ప్రీతీ, హనమకొండ కాకతీయ డిగ్రీ కాలేజీ నుండి యు.శివ, సిర్పూర్ ఖాగజ్ నగర్ నుండి ఎ. సామ్రాట్, హనంకొండ కిట్స్ కాలేజీ నుండి ఎం. సంజయ్, హనంకొండ పింగళి మహిళా కాలేజీ నుండి మహమ్మద్ సనా ఉన్నారని, వీరికి కాంటింజెంట్ లీడర్ గా, సుబేదారి, విశ్వవిద్యాలయ పి.జి. కాలేజీ, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కే. కవిత వ్యవహరిస్తుని, వీరిని వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం వాలంటీర్లను అభినందించారు.

# విద్యార్థులతో సైకిల్ ర్యాలీ



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో సోమవారం పోలీస్ అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా బోయినిపల్లి ఏఎస్ఐ ఆర్ మల్లేష్, ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అలాగే ఆనంద్ విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గంగాధర రోడ్డు ఆనంద్ విద్యానికేతన్ హై స్కూల్ వద్ద నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, స్కూల్ కరస్పాండెంట్ బిల్ల ఆనందం,పాల్గొన్నారు.

# దళారులకు ధాన్యం అమ్మి రైతులు నష్ట పోవద్దు

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం చొప్పదండి నియోజకవర్గం శాసన సభ్యులు డా. మేడిపల్లి సత్యం, ఆదేశాల మేరకు బోయినిపల్లి మండలంలోని దుంద్రపల్లి, అనంతపల్లి, స్థంభంపల్లి మల్కాపూర్, రత్నంపేట, దేశాయిపల్లి, గ్రామాలలో ఐకెపి ఆద్వర్యం లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కాలే నారాయణ రెడ్డి, ఎంపీడీఓ భీమా జయశీల, ఏ.ఓ ప్రణిత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి,డైరెక్టర్లు ఎం.డి బాబు, మెరుపుల మహేష్, కళ్లేపెల్లి సతీష్, మాజీ ఎంపీటీసీ లు ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, అక్కనేపెల్లి ఉపేందర్, పురుషోత్తం రెడ్డి మాజీ సర్పంచ్ లు కోరేపు నరేష్, సత్యనారాయణ రెడ్డి, గోపాల్ రెడ్డి, నాయకులు ఏనుగుల కానుకయ్య, సంబ లక్ష్మీరాజాం, జంగం అంజయ్య, సువీన్ యాదవ్,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొడగాని వెంకటేష్, ఎండీ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు కేయూ రెజ్లింగ్ టీమ్ ఎంపిక

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

హనమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నేడు మంగళవారం ఉదయం 8.30 గంటలకు కాకతీయ యూనివర్సిటీ రెజ్లింగ్ టీం సెలక్షన్స్ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో ఎంపికైన క్రీడాకారులను ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ రెజ్లింగ్ ఛాంపియన్షిప్ కు కాకతీయ యూనివర్సిటీ తరుపున పంపడం జరుగుతుందని కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ఆచార్య వై.వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# పురుగుల మందు తాగి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

## – సబ్ ఇన్స్పెక్టర్ రమకాంత్



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన పిట్టల ఆదిత్య(18), తండ్రి మల్లేశం, అనే వ్యక్తి అలుగునూర్ లోని ఎస్ ఆర్ కాలేజీ లో హాస్టల్లో ఉండి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పండుగ కొసం ఇంటికి వచ్చిన అతడు తిరిగి హాస్టల్ కు వెళ్ళడం ఇష్టం లేక సోమవారం ఉదయం సుమారు 10:30 గంటలకు బోయినిపల్లి గ్రామ శివారు లోని గంగిపెల్లి మొండయ్య, అనే వ్యక్తి యొక్క పొలం వద్ద పత్తి పురుగుల మందు త్రాగగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్ ఆసుపత్రి కి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యా హ్నం ఆదిత్య,మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

## పోలీసుల శ్రమదానం..

# చెట్లను తొలగింపు



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల పరిధిలోని మాంధారి పేట, సూరంపేట గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్లను సోమవారం శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కలిసి శ్రమదానం చేసి తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా వాహనదారులకు ఇబ్బంది గా మారిన చెట్లను ప్రజల భద్రతని దృష్టిలో పెట్టుకొని రోడ్ల మీద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకొని శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ చెట్లను తొలగించారు.

# నిధులు దుర్వినియోగంపై గ్రీవెన్స్ లో ఫిర్యాదు

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలోని చేనేత సహకార సంఘం కార్మికులు నిధులు దుర్వినియోగంపై సోమవారం కార్మికులు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. చేనేత కార్మిక సంఘానికి వివిధ రకముల స్కీముల ద్వారా వచ్చిన నిధులు దుర్వినియోగం జరిగినది అని అట్టి దుర్వినియోగానికి అయిన నిధులు కార్మికుల కు తెలుపాలని కార్మికుల కు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇట్టి నిధులపై ఎంక్వయిరీ చేసి ఈ సంస్థకు ఎదుగుదలకు పాటుపడాలని వారన్నారు.

# హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు..!

కూకట్‌పల్లి ప్రాంతంలోని పరికి చెరువులో సుమారు 12 ఎకరాల మేర రాత్రికి రాత్రే మట్టిపోసి ఆక్రమించారని, అక్కడ 18 అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే ప్లాట్లు కొన్నవారు నష్టపోతారని హెచ్చరించారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

**– విధులకు గైర్హాజరైన ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ – ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్**

**వేద న్యూస్, తంగళ్లపల్లి:**

సీజనల్ వ్యాధులపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి అవగాహన కల్పించాలని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ సూచించారు. తంగళ్లపల్లి మండలం లోని నేరెళ్ల పీహెచ్ సీ ని ఇంచార్జి కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, రక్త పరీక్షలు చేసే ల్యాబ్, మందుల గది, ఇతర గదులు, ఆవరణ పరిశీలించారు. వ్యాక్సిన్లు, మందుల నిలువుపై ఆరా తీశారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఫార్మసిస్ట్, సూపర్వైజర్ కు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. రోజు ఆసుపత్రికి ఎందరు రోగులు వస్తున్నారని, ఎందరు గర్భిణులు వైద్య సేవలు పొందుతున్నారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలపై అందరికీ అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని తెలిపారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

ఇక్కడ నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి చేతగాకే చెడ్డి గ్యాంగ్ తో దాడులు..!?

**వేద న్యూస్, మానకొండూర్:**

మానకొండూరు నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య రాజకీయ వివాదం రోజురోజుకు తీవ్రమవుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, తనపై దాడులు చేయిస్తున్నారని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు రసమయి బాలకిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అభివృద్ధి చేయడంలో విఫలమై, తనపై కాంగ్రెస్ 'చెడ్డి గ్యాంగ్'తో దాడులు చేయిస్తున్నాడని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను దూషించిన విషయమై ఆయనపై కేసు నమోదు చేయాలని కోరుతూ రసమయి బాలకిషన్ స్థానిక సీఐని కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయనతో పాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణ రావు. కూడా సీఐని కలిసి ఫిర్యాదు అందజేశారు. రసమయి బాలకిషన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. తమ నాయకుడికి మద్దతుగా నినాదాలు చేశారు.



**– మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపణ**

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, "2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యమకారుడినైన నన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన గడ్డ మానకొండూరు నియోజకవర్గము. గత పదేళ్లలో మానకొండూరు నియోజకవర్గము ఎంతో అభివృద్ధి, ప్రగతి సాధించింది," అని తెలిపారు. మానకొండూర్ నియోజకవర్గం పేరు చెప్పగానే తెలంగాణ ప్రజలు ఉలిక్కిపడి పోతున్నారని, రాష్ట్ర ప్రజలు ఛీత్కరిస్తున్నారని సంచలన ఆరోపణలు వెలువడ్డాయి. నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై ఆరోపణలు గుప్పించిన వారు, ఎమ్మెల్యే నిరాధారమైన ఆరోపణలతో కేసులు పెట్టి రాజకీయ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ఆయన తీరు చూస్తుంటే 'దొంగనే దొంగ అన్నట్టు' ఉందని పేర్కొన్నారు.

గత సెప్టెంబర్ 28వ తేదీ రోజు జర్నలిస్టుల సాక్షిగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తనను దుర్భాషలాడినారని, ఎమ్మెల్యే కవ్వంపల్లి వైద్య విద్యలో బూతులు తిట్టడం నేర్చుకున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎవరు ఎలాంటివారో మానకొండూర్ నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసని, తన తల్లిని, భార్యను, పిల్లలను తిట్టడం, తన 'కలర్'ను కూడా ఎమ్మెల్యే దూషించడం బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. "గిసొంటి సంస్కారం లేని ఎమ్మెల్యే విజ్ఞతకే వదిలేస్తున్నాం" అని తెలిపారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరువు పోతుందని నేను అమెరికా పోయిన తర్వాత నేను ఆయనను తిట్టినట్లు వీడియో తయారు చేసి పోలీస్ స్టేషన్ లో అక్రమ కేసు పెట్టించారు. మానకొండూర్ నియోజకవర్గములో బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టిస్తున్నాడని, ఎమ్మెల్యే సంస్కారం ఎందో ఇప్పుడు ప్రజలకు తెలుస్తున్నదని అన్నారు. లారీ కింద పడి చనిపోయిన సురేష్ గౌడ్ ను కూడా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎందుకు తిట్టినారని, ఎమ్మెల్యే నీచమైన మాటలు మాట్లాడినారని అన్నారు. వార్తలు రాసే జర్నలిస్టులను కూడా ఎమ్మెల్యే తిట్టడం అప్రజాస్వామికమని, ఎమ్మెల్యే కవ్వంపల్లి సారథ్యంలో అతడి "చెడ్డి గ్యాంగ్" దాడులకు తెగబడుతోందని ఆరోపణలు చేశారు. తన ఇంటిపై దాడి చేసి, ఇంట్లో ఉన్న మనుషులపై హత్యాయత్నం చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి చేసిన అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యేకు సంస్కారం ఉంటే, తక్షణమే పాత్రికేయుల సాక్షిగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉల్టా కేసులు పెట్టి బెదిరించాలని చూస్తే బెదిరేది లేదని స్పష్టం చేశారు. గత రెండేళ్లలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు వివరించాలని, ఇప్పటికైనా తన వైఖరి మార్చుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి వ్యవహారశైలిని ప్రజలు క్షమించబోరని హెచ్చరించారు.

# పారిశుద్ధ్య నిర్వహణ 'గుండు' సున్నా!

- **నగర ప్రథమ పౌరురాలిది సదరు డివిజన్**
- **రాష్ట్ర రెండో రాజధానిగా పేరు గాంచిన వరంగల్‌లో ఇదీ పరిస్థితి**
- **గ్రేటర్ వరంగల్ 29 వ డివిజన్‌లో డ్రెయినేజీ నిర్వహణ గిట్లనా ఉంటే..?**
- **బయటకొస్తే ముక్కుపుటాలు అదురుతున్నాయని చెబుతూ కాలనీవాసుల ఆవేదన**
- **తమ సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులు, పాలకవర్గానికి వేడుకోలు**

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

స్వయంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మేయర్‌గా వ్యవహరిస్తున్న ప్రజాప్రతినిధి డివిజన్‌లోనే ఇదీ పరిస్థితి.. అందులోనూ సదరు డివిజన్ బల్దియా ఆఫీసుకు కూతవేటు దూరంలోనే ఉండటం గమనార్హం. జీడబ్ల్యూఎంసీ 29వ డివిజన్‌లోనీ 5, 6 బ్లాక్‌లు గల బొమ్మల సత్తయ్య గల్లీలో మూడు నెలల క్రితం నూతన సీసీ రోడ్డు, తాగు నీళ్ల పైప్ లైన్, నూతన డ్రైనేజీ నిర్మాణం కోసం పనులు ప్రారంభించి.. మొదట మంచి నీళ్ల పైప్ లైన్ వేశారు. కొన్ని రోజుల తర్వాత రోడ్డుకు ఇరువైపుల కంకర వేసీ సీసీ రోడ్డు వేయడానికి ప్రయత్నిస్తుండగా, కాలనీ వాసులు డ్రైనేజీ నిర్మాణం గురించి ప్రశ్నించగా.. "అదిగో వేస్తాం, ఇదిగో వేస్తాం" అంటూ.., "వర్షాలు కురుస్తున్నాయి ఆగిన తర్వాత వేస్తాం" అంటూ.., "ఒకసారి వేస్తాం, ఇంకోసారి వెయ్యం" అని రకరకాల కారణాలు చెబుతూ నాలుగు నెలలకు పైగా ఎటువంటి పనులు చేయకుండా నాన్చుతున్నారు.

**– అస్తవ్యవస్తంగా డ్రైనేజీ**


ఇప్పుడు అకస్మాత్తుగా డ్రైనేజీ లేకుండా సీసీ రోడ్డు వేయడానికి సిద్ధం అయ్యారు. దాంతో తమ కాలనీ డ్రైనేజీ చాలా పురాతనమైందని, శిథిలావస్థకు చేరుకొని కాలువ పునాది రాళ్లు.. కృంగిపోయి చిందర వందరగా ఉండి మురికి నీరు సక్రమంగా ప్రవహించకుండా, దుర్గంధభరితంగా అయి దోమలకు నిలయంగా మారాయని కాలనీవాసులు చెబుతున్నారు. డ్రైనేజీ రాళ్లు అస్తవ్యస్తంగా ఉండటం కారణంగా ఎలుకలు మట్టిని తవ్వుకుని ఇళ్లలోకి ప్రవేశిస్తూ.. నానా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ప్రజలు వివరిస్తున్నారు.

**– మేయర్ పట్టించుకోవాలి**

తమ కాలానికి డ్రైనేజీ వ్యవస్థను నూతనంగా నిర్మించిన తర్వాతనే సీసీ రోడ్డు వేయాలని కాలనీ వాసులు కోరుకుంటున్నారు. రోడ్డు పై వేసిన కంకర కారణంగా వాహనాల మాట అటుంచితే.. కనీసం మనుషులు కూడా నడవలేని పరిస్థితి నెలకొంది. రాకపోకలకు స్కూల్ పిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సాక్షాత్తు మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ అయి ఉండి కూడా ఇలాంటి పరిస్థితులు రావడం ఏంటని స్థానికులు



వాపోతున్నారు. నగర ప్రథమ పౌరురాలు ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌లోనే జనం సమస్యలను పట్టించుకునే నాథుడే లేకపోతే.. ఇక ఇతర డివిజన్ల పరిస్థితి ఎలా ఉంటుందోనని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మేయర్ గారూ తన సొంత డివిజన్‌లో మౌలిక సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణపైన దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే క్షేత్రస్థాయి పర్యటనకు వస్తే మేయర్ గారూ సైతం తన సొంత డివిజన్‌కు వస్తే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయని హెచ్చరిస్తున్నారు. తాను గెలిచి ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ ప్రజలకు దుర్గంధం నుంచి విముక్తి కలిగేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వేద న్యూస్

మంగళవారం అక్టోబర్ 28, 2025

# రైతు సంతోషంగా ఉంటేనే దేశం సంతోషంగా ఉంటుంది

**- పత్తి రైతులను ఆదుకుంటాం**
**- ఏనుమాముల మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

**వేద న్యూస్,వరంగల్ ప్రతినిధి:**

వరంగల్ లోని ఏనుమాముల మార్కెట్ యార్డ్ లో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యం లో ఏర్పాటుచేసిన సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంబించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్దదైన వరంగల్ వ్యవసాయ మార్కెట్లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించుకోవడం సంతోషదాయకమన్నారు.

రైతు సంతోషంగా ఉంటేనే దేశం సంతోషంగా ఉంటుందని దృఢంగా నమ్మి దిగంత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా, గిట్టుబాటు ధర, సబ్సిడీ మీద విత్తనాల పంపిణీ,ఇండస్ట్రియల్ పాలసీని తీసుకురావడం వల్ల రైతులకు ఎంతో మేలు జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఇందిరమ్మ రాజ్యంలో రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు.

రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్ కు తీసుకొచ్చి గరిష్ఠ ధరను పొందాలని మంత్రి కొండా సురేఖ చెప్పారు.



ఎనుమాముల మార్కెట్ కు వచ్చిన పత్తి బస్తాను కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. తేమను దృష్టిలో ఉంచుకొని ధర నిర్ణయించడం జరుగుతున్నందున, తేమ వల్ల రైతులు నష్టపోకుండా పరిశీలించేందుకు కమిటీని వేయడం జరిగిందన్నారు. ప్రత్తి విక్రయించిన మూడు నుండి ఐదు రోజుల్లోనే సంబంధిత రైతు బ్యాంక్ అకౌంట్కు నేరుగా డబ్బులు జమవుతాయన్నారు. రైతుల సంక్షేమం కొరకు రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రైతు రుణమాఫీ చేసిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామని, వడ్లు కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతులకు డబ్బులు జమ అవుతున్నాయని అన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు.

సీసీఐ ద్వారా మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు ఏ ఇబ్బందీ లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారని, వరి, మొక్కజొన్న కేంద్రాలు ప్రారంభించి రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు.తేమ పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టాలని చూస్తే ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. వ్యవసాయ అధికారుల వద్ద తేమ యంత్రాలు ఉన్నాయని, రైతుల పొలాల వద్దనే తేమ శాతం పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తి రైతులకు నష్టం చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.వ్యవసాయ మార్కెట్ యార్డులో సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్లో అగ్రిటెక్ ను సందర్శించి వ్యవసాయంలో ఆధునీకరణపై ప్రదర్శించిన వ్యవసాయానికి సంబంధించిన వివిధ రకాలైన యంత్రాలు, పనిముట్లు పరికరాలను పరిశీలించిన మంత్రి వ్యవసాయంలో వినూత్న పద్ధతులను పాటించి సాంకేతికతను వినియోగించుకొని అగ్రిటెక్లో ఉన్న యంత్రాలను రైతులు సబ్సిడీ ధరలపై కొనుగోలు చేసి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, సిసిఐ జనరల్ మేనేజర్ మోహిత్ శర్మ, మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ,డిసిఓ నీరజ, కాటన్ కొనుగోలు అధికారి కృష్ణారెడ్డి, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కురిక్యాల ఘటనపై ఎమ్మెల్యే సత్యం సీరియస్

**వేదన్యూస్, గంగాధర :**

గంగాధర మండలం కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులపై అటెండర్ అసభ్య ప్రవర్తన కలకలం రేపింది. ఈ ఘటనపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యాకూబ్ పాషా అనే అటెండర్ విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఘటనపై ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, కమిషనర్ గౌస్ ఆలం లతో ఫోన్‌లో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకొని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, “పాఠశాలలో ఏడాది కాలంగా వేధింపులు జరుగుతున్నా అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం, వారి నిర్లక్ష్యం పై మండి పడ్డారు. ఈ ఆకృత్యానికి పాల్పడిన అటెండర్‌ను వెంటనే విధుల నుండి తొలగించాలి అని ఈ ఘటనకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధం ఉన్న వారందరిపై తప్పనిసరి” కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అధికారులను హెచ్చరిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన పర్యవేక్షణ ఉండాలని సూచించారు. బాధిత విద్యార్థినులకు పూర్తి స్థాయిలో అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.



# జమ్మికుంట ఖ్యాతి నిలబెట్టిన ‘ప్రసంగి’

**వేద న్యూస్, జమ్మికుంట:**

సన్‌షైన్ కల్చరల్ అకాడమీ 25వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి నృత్య పోటీలలో జమ్మికుంటకు చెందిన ప్రసంగి డాన్స్ స్టూడియో అండ్ ఫిట్‌నెస్ సెంటర్ విద్యార్థులు అద్భుత ప్రతిభను ప్రదర్శించి పలు విభాగాలలో విజయాలను సాధించారు. ప్రసంగి, స్నికిత కలిసి ప్రదర్శించిన సీనియర్ డ్యూయెట్ నృత్యం ప్రథమ బహుమతిని సాధించారు. స్నికిత పాల్గొన్న జూనియర్ సోలో డాన్స్ విభాగంలో ద్వితీయ బహుమతి తో పాటు నగదు బహుమతి ను కూడా అందుకున్నారు. లియాప్రసంగి, ప్రకృతి, రసగ్న, సుధీక్ష, లాస్య లతో కూడిన లియాప్రసంగి టీమ్ అద్భుతమైన ప్రదర్శనతో జూనియర్ గ్రూప్ డాన్స్ విభాగంలో ద్వితీయ బహుమతిని చుకుంది. నాట్య ప్రసంగి సబ్ జూనియర్ సోలో విభాగంలో ప్రత్యేక నృత్య ప్రదర్శన కు ఎంపికై అందరి ప్రశంసలు అందుకుంది.

**- విజేతలకు గజ్జెల అభినందన**

ఈ పోటీలు 2025 అక్టోబర్ 25న కరీంనగర్ కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేక బృందాలు పోటీల్లో పాల్గొన్నాయి. కాడమీ డైరెక్టర్ గజ్జెల ధర్మేందర్ విజేతలను అభినందిస్తూ, యువ కళాకారులు సాంస్కృతిక రంగంలో ప్రతిభను మరింత అభివృద్ధి చేసుకోవాలని ప్రోత్సహించారు. న్యూ మిలీనియం స్కూ జమ్మికుంట చైర్మన్ ముసిపట్ల తిరుపతి రెడ్డి, ప్రిన్సిపాల్ వరుణ్ రెడ్డి, లియాప్రసంగి, నాట్య ప్రసంగి బృందాలకు ఈ విజయంపై హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. వారు విద్యార్థుల కృషి, ప్రతిభ, సాంస్కృతిక చైతన్యాన్ని ప్రశంసిస్తూ, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రసంగి డాన్స్ స్టూడియో అండ్ ఫిట్‌నెస్ సెంటర్ మేనేజర్, ప్రొప్రైటర్ శ్రీలత , డాన్స్ మాస్టర్లు ప్రసంగి, కే. రాజేష్.. అద్భుత విజయాల సాధించిన స్టూడెంట్స్ ను అభినందించారు. విద్యార్థులు కష్టపడి సాధించిన ఫలితాన్ని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రొప్రైటర్ ఏన్.శ్రీలత మాట్లాడుతూ జమ్మికుంట ప్రాంతం నుండి రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో పాల్గొని విజయం సాధించడం ఎంతో గర్వకారణం. ఇటువంటి పోటీలు మన పట్టణానికి గౌరవాన్ని తెస్తాయని చెప్పారు.



# చలనం లేదా..!?

తరలించాలని ఆగస్టు 11న జస్టిస్ జేబీ పర్దీవాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం ఆదేశించింది. దీనిపై తీవ్రమైన తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో షెల్టర్ల నిర్వహణ కోసం భారీగా ఖర్చు అవుతుందని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అంచనా వేశారు. రోజూ వాటి నిర్వహణపై రూ.11 కోట్ల (ఒక్కో కుక్కపై రూ. 110) ఖర్చు వస్తుందని అన్నారు. వీధి కుక్కలకు సంబంధించిన ఆహారం, నీరు, సంరక్షణ, పారిశుధ్యం, వైద్య చికిత్స, రవాణా సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, ఉద్యోగుల వేతనాలపై డబ్బును వెచ్చించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే క్రమంలోనే జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఆగస్టు 11న వచ్చిన అభ్యంతరాలపై విచారణ చేపట్టింది. రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడినుంచి తీసుకొచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంది. షెల్టర్లకు తరలించాలని తీర్పును సవరించింది. అలాగే ఆదేశాల అమలుకు సంబంధించి అఫిడవిట్లు దాఖలు చేయాలని రెండు నెలల సమయం ఇచ్చింది.

# నిబద్ధతతో ప్రజా సమస్యలను పరిష్కరించాలి

**- వివిధ విభాగాల నుండి 98 ఫిర్యాదుల స్వీకరణ**


**వేద న్యూస్, వరంగల్:**



అధికారులు నిబద్ధతతో ప్రజా సమస్యలను పరిష్కరించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి విద్యార్థులను స్వీకరించి పరిష్కారార్థమై ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదులు విభాగాల వారిగా చూస్తే టౌన్ ప్లానింగ్ 49, ఇంజనీరింగ్ 22, రెవన్యూ12, హెల్త్ శానిటేషన్ 11, నీటి సరఫరా 03, హార్టికల్చర్ 01, మొత్తం 98 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ ఈ సత్యనారాయణ,సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, సి హెచ్ఓ రమేష్, డిఎఫ్ఓ శంకర్ లింగం ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య, ఎం హెచ్ ఓ డా.రాజేష్, పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భార్యాభర్తలను వరించిన అదృష్టం

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి:**



జిల్లా కలెక్టర్ కార్యాలయం లో తీసిన మద్యం టెండర్ల డ్రాలో భార్యాభర్తలను అదృష్టం వరించింది. జిల్లాలో 93 దుకాణాలకు 2070 దరఖాస్తులు చేసుకోగా సోమవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ డ్రా పద్ధతిలో దుకాణాలను ఎంపిక చేశారు. వీటిలో వేములపల్లి మండలం లక్ష్మీదేవి గూడెం గ్రామానికి చెందిన ఎలికట్టి భరత్ కు గెజిట్ నెంబర్ 21లో ఆయన భార్య శ్రావణికి గెజిట్ నెంబర్ 13 లో షాపులు దక్కించుకున్నారు. వందల టెండర్లలో భార్యాభర్తలకు షాపులు దక్కడంతో పలువురు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# మత్స్యకారుల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**వేద న్యూస్, శాయంపేట:**



చేపల పెంపకానికి మత్స్యకారుల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మత్స్యశాఖ నుండి మంజూరైన చేపల సంచార విక్రయ వాహనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చేపల సంచార వాహనం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తాజా చేపలు తక్కువ ధరకు ప్రజలకు అందించడంతోపాటు స్థానిక మత్స్యకారులకు స్థిరమైన ఆదాయ వనరుల అబిస్తాయని ఎమ్మెల్యే అన్నారు. మత్స్య కార్మికులు అభివృద్ధి చెందితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం చేపల సాగుకు అవసరమైన సౌకర్యాలు మార్కెట్లు రవాణా సదుపాయాలను మెరుగుపరచడానికి కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి , చిందం రవి, దుబాసి కృష్ణమూర్తి , పోలపల్లి శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్తలు,సురేఖ మండల సమైక్య అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందించిన అక్తర్

**వేద న్యూస్, కరీమాబాద్:**

ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2 వరకు తమిళనాడులో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళల కబడ్డీ టోర్నమెంట్ కాకతీయ విశ్వవిద్యాలయం జట్టుకు కరీమాబాద్ వాసి యూ.సంజన ఎంపిక అయ్యారు. కాగా వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఇనాయతుల్లా అక్తర్ బేగ్ సంజనను అభినందించి ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సహాయన్ని అందించారు.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073